Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 298 | గురువారం 14 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




IRS PUBLICATIONS
irspublications12@gmail.com



## ఇజ్రాయిల్ సైన్యం డ్రోన్లతో కార్లపై దాడి - ఎనిమిది మృతి

2లో



## విజయ్ ఓఎస్‌డీగా జ్యోతిష్యుడు.. నియామకం రద్దు

2లో



# బలపరీక్షలో నెగ్గిన విజయ్

- టీవీకే సర్కార్కు అనుకూలంగా 144 ఓట్లు
- విజయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసిన 22 మంది సభ్యులు
- వాకౌట్ చేసిన డీఎంకే
- మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, సీపీఐ(ఎం) సీపీఐ,వీసీకే



చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడులో నూతనంగా కొలువుదీరిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గట్టెక్కింది. విజయ్‌కు అనుకూలంగా 144 ఓట్లు, వ్యతిరేకంగా 22 ఓట్లు వచ్చాయి. పీఎంకే, బీజేపీకి చెందిన మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా నిలిచారు. విజయ్ ప్రభుత్వం బల పరీక్షలో నెగ్గినట్టు స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ప్రకటించారు. మే 13వ తేదీలోగా మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం 'ఫ్లోర్ టెస్ట్' నిర్వహించారు. విశ్వాస పరీక్షపై తీర్మానాన్ని సీఎం విజయ్ ప్రవేశపెట్టారు. తమిళనాడు అసెంబ్లీ చర్చ సందర్భంగా తొలుత మాట్లాడిన కాంగ్రెస్ సభ్యులు తాము విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలపై

- మిగతా 2లో..



## హిందూయిజం ఒక జీవన విధానం

-- విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం తప్పనిసరేం కాదు : సుప్రీంకోర్టు
- విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని వ్యాఖ్య

2లో



## ఎన్‌టిఎను రద్దు చేయాలి - పినరయి విజయన్

2లో

## ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ

- ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్
- సీఎంతో ఉబర్ సీఈఓ దారా ఖోస్రోషాహి భేటీ
- పార్కింగ్ సమస్యపై దృష్టిపెట్టండి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన




హైదరాబాద్ - సూర్య వాస్తవం

ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉబర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. బుధవారం హైదరాబాద్

- మిగతా 2లో..

## సామర్థ్యం పెంపుతో ఆర్థిక పటిష్టత

- ప్రతినెలా గణాంకాల సేకరణ
- పక్కాగా అంచనాలు
- ఉద్యోగులకు 3 నెలల శిక్షణ
- ప్రణాళికశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రాన్ని ఆర్థికంగా పటిష్ట పరిచేందుకు వ్యవస్థలో సామర్థ్య పెంపు జరగాలని, ఇందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 15 శాతం వృద్ధి సాధించడంతో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను చేరుకోగలమన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రణాళికశాఖపై సమీక్షా సమావేశాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వేగంగా గణాంకాలను సేకరించేందుకు రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జిఎస్‌డిపి అంచనాలను సంప్రదాయ విధానంలో కాకుండా రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా రూపొందించేలా శిక్షణ అందించాలన్నారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

'మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా - మేడ్ ఫర్ ది వరల్డ్'..

## ఇదే మా ధ్యేయం: నారా లోకేష్


- రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర
- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు
- వచ్చే మూడు నెలల్లో 100 ఏపీ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ కావాలని లక్ష్యం
- 'ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదంతో 22 క్లస్టర్ల ఏర్పాటు
- 'మేడ్ ఇన్ ఆంధ్ర -- మేడ్ ఫర్ ఇండియా -- మేడ్ ఫర్ ది వరల్డ్' ప్రభుత్వ ధ్యేయం

2లో



## పెరగనున్న ఎండల తీవ్రత

- విపత్తుల నిర్వహణ సంస్థ



# ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ ఎక్సెలెన్స్ సెంటర్ ను విస్తరిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేననీ, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తిగా ఉన్నామని దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ చార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.

హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామనీ, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీవో) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## సామర్థ్యం పెంపుతో
# ఆర్థిక పటిష్టత

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే పూర్తి స్థాయిలో డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతామని తెలిపారు. సమీక్షలో జిఎస్‌డిపి కెపాసిటీ బిల్డింగ్, ఎఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రధాన సర్వేలు, జిల్లా-మండల స్థాయి అధికారులకు శిక్షణ, కెపిఐల ఆడిటింగ్ అనుసంధానం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం రాష్ట్ర జిఎస్‌డిపి అంచనాలు మూడు నెలలకు, ఏడాది కాలానికి రూపొందిస్తున్నారని, దీంతో ఆర్థిక స్థితిగతులపై తక్షణ అవగాహన సాధ్యం కావడం లేదని అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఎక్కువ ఆధారపడటం వల్ల విధాన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిని ప్రతినెలా.. ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో ట్రాక్ చేయగలిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జిఎస్‌డిపి విధానాన్ని అర్థం చేసుకునేలా, అంచనాలు వేగంగా రూపొందించేలా అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. మొత్తం 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ 3 నెలల పాటు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు, జోనల్-జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తయారీపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మరోవైపు వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఎఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం ట్రాక్ చేయని సూచికలను గుర్తించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

## హిందూయిజం
# ఒక జీవన విధానం

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

హిందూయిజం అనేది జీవన విధానమని, ఈ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం లేదా పూజలు చేయడం తప్పనిసరేం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. హిందూయిజంపై విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని తేల్చి చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లతో పాటు దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరిపే క్రమంలో బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోరు మాల్యా బాగ్చి కూడా ఉన్నారు.

**శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు**
**-- పునస్సమీక్ష పిటిషన్లపై విచారణ**

శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

## విజయ్ ఓఎస్‌డీగా జ్యోతిష్యుడు..
# నియామకం రద్దు

**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (ఎఖ) అధినేత విజయ్ తన వ్యక్తిగత జ్యోతిష్యుడు రాజన్ పండిట్‌ను 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ' (ఌూణ)గా నియమించుకోవడంపై రాజకీయంగా దుమారం రేగుతోంది. తాజాగా ఈ అంశంపై టీవీకే ప్రభుత్వం స్పందించింది. రాజన్ పండిట్‌ను ఓఎస్‌డీ నియమాకాన్ని రద్దు చేసింది. కాగా, విజయ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ అసెంబ్లీ వేదికగా తీవ్రంగా ఖండించారు. జ్యోతిష్యుడికి అధికారిక పదవి కట్టబెట్టడంపై ఆమె మండిపడుతూ, రాజన్ పండిట్ విజయ్‌కు వ్యక్తిగత గురువు అయితే ఆయనను సొంత పనులకే పరిమితం చేసుకోవాలని, ప్రభుత్వ వ్యవస్థలోకి తీసుకురావడం సరికాదని హితవు పలికారు. యువత ఎంతో నమ్మకంతో విజయ్‌కు ఓట్లు వేశారని, ఇప్పుడు ఇటువంటి నిర్ణయాల ద్వారా భావి తరానికి ఆయన ఎలాంటి ఉదాహరణగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## బలపరీక్షలో
# నెగ్గిన విజయ్

(మొదటి పేజీ తరువాయి)

హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వామపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించాయి. సీఎం విజయ్ ప్రమాణస్వీకారానికి ముందు గవర్నర్ ఆర్లేకర్ పలుమార్లు తిరస్కరించిన తీరుపై సీపీఐ(ఎం) అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడులో గవర్నర్ రూల్‌ను అడ్డుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది. విజయ్ ఐదేండ్ల పాటు కొనసాగాలని వీసీకే అశాభావం వ్యక్తం చేసింది. అయితే ఓఎస్డీగా వ్యక్తిగత జ్యోతిష్యుడిని విజయ్ నియమించడంపై అభ్యతరం వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఏఎంఎంకే బహిష్కృత ఎమ్మెల్యే కామరాజు సైతం విజయ్‌కు మద్దతు ఇచ్చారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే సైతం విజయ్‌కు మద్దతు తెలిపింది.

**డీఎంకే వాకౌట్**

డీఎంకేతో పాటు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం వ్యతిరేకించాయి. బలపరీక్షకు ముందుగానే విజయ్, తమిళనాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని డీఎంకే నేత ఉధయనిధి స్టాలిన్ ఆరోపించారు. 65 శాతం తమిళనాడు ఓటర్లు విజయ్‌కి వ్యతిరేకంగా ఓటు వేశారని పేర్కొన్నారు. తమ కూటమి పక్షాలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని విజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడులో రీల్ ప్రభుత్వం కాకుండా రియల్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్‌కు దూరంగా ఉంటామని చెబుతూ 59 ఎమ్మెల్యేలు ఉన్న డీఎంకే వాకౌట్ చేసింది. అయితే బీజేపీ మాత్రం ఈ ఓటింగ్‌లో 'తటస్థంగా' ఉండాలని నిర్ణయించింది. అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించింది. మరోవైపు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం విజయ్‌కు ఓటు వ్యతిరేకంగా ఓటు వేస్తామని ముందే చెప్పింది. విజయ్ ప్రభుత్వం తమ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు డబ్బు ఆశ చూపి ఆకర్షించే ప్రయత్న చేసిందని ఆరోపించారు. మరోవైపు అన్నాడీంకే షణ్ముగం వర్గం పళనిస్వామి వ్యాఖ్యలను ఖండించింది. 25 మంది షణ్ముగం వర్గం ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.

**మద్దతిచ్చిన వారికి విజయ్ కృతజ్ఞతలు**

చర్చ అనంతరం టీవీకే ప్రభుత్వానికి మద్దతిచ్చిన అందరికీ విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం పూర్తి ఐదేండ్ల కాలం పాలిస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. టీవీకే ప్రభుత్వం సంపూర్ణ లౌకిక విధానాన్ని అవలంబిస్తుందని విజయ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హామీలను కూడా కొనసాగిస్తామని చెప్పారు. టీవీకే ప్రభుత్వం ఓటు వేయనివారిది కూడా అని విజయ్ పేర్కొన్నారు. టీవీకే ఎమ్మెల్యేకు సుప్రీం కోర్టులో ఊరట ఒక్క ఓటు తేడాతో గెలిచిన టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఫ్లోర్ టెస్ట్లో పాల్గొనకూడదని మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తమిళనాడు అసెంబ్లీలో ఓటు హక్కు వినియోగానికి అవకాశం కల్పించింది.

## 'మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా - మేడ్ ఫర్ ది వరల్డ్'..
# ఇదే మా ధ్యేయం: నారా లోకేష్

**అమరావతి – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ బృహత్కార్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. "మేడ్ ఇన్ ఆంధ్ర -- మేడ్ ఫర్ ఇండియా -- మేడ్ ఫర్ ది వరల్డ్" అనే నినాదాన్ని సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (చీూజు), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీఐఐ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన ఎస్ఎంఈ ఐపీఓపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**యువగళం యాత్రే స్ఫూర్తి**

తన యువగళం పాదయాత్రే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి స్ఫూర్తినిచ్చిందని లోకేష్ వివరించారు. "3132 కిలోమీటర్ల పాదయాత్రలో ఎందరో ప్రజల కష్టసుఖాలు చూశాను. పెనుగొండలో కియా అనుబంధ సంస్థలో పనిచేస్తున్న పద్మావతి అనే సోదరి తన అనుభవాన్ని పంచుకుంది. కియా రాకముందు గృహిణిగా ఉన్న ఆమె, పరిశ్రమ వచ్చాక ఉద్యోగంలో చేరి నెలకు రూ.30 వేలు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆమె కథ విన్నాక ఉద్యోగ కల్పన ప్రాధాన్యం నాకు మరింత అర్థమైంది. ఆ ఆలోచన నుంచే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం పుట్టింది" అని లోకేష్ పేర్కొన్నారు.

**పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్**

గడిచిన 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని మంత్రి తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. ఇప్పటివరకు 800 ప్రాజెక్టుల ద్వారా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదిరాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రూ.1.35 లక్షల కోట్ల చొప్పున పెట్టుబడులతో ముందుకొచ్చాయి. వాటికి శంకుస్థాపనలు కూడా జరిగాయి. రాయల్ ఎన్ఫీల్డ్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలతో పాటు పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ కేంద్రం 'ూవీజూ' ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి రాబోతోంది" అని వెల్లడించారు.

ఒక పెద్ద పెట్టుబడి వస్తే దాని చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు ఎలా వస్తాయో వివరిస్తూ 'మల్టిప్లయర్ ఎఫెక్ట్' గురించి లోకేష్ మాట్లాడారు. "విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కారణంగా, దానికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్ సరఫరా కోసం క్యారియర్ కంపెనీ శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇదే మల్టిప్లయర్ ఎఫెక్ట్," అని ఆయన వివరించారు.

**అభివృద్ధి వికేంద్రీకరణే ప్రభుత్వ లక్ష్యం**

'ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ' అనేదే ప్రభుత్వ విధానమని లోకేష్ స్పష్టం చేశారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నాం. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమలో ఆటోమొబైల్, కోస్తాలో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఫార్మా, డేటా సెంటర్లు వంటి రంగాలపై దృష్టి సారించాం. నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయబోతున్నాం," అని తెలిపారు.

**ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ అండ**

"మాకు గూగుల్ ఎంత ముఖ్యమో, రూ.50 లక్షల పెట్టుబడితో మొదలయ్యే చిన్న పరిశ్రమ కూడా అంతే ముఖ్యం. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు పయనిస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు ఏ కష్టం వచ్చినా తాను ఒక మెసేజ్ దూరంలో ఉంటానని" భరోసా ఇచ్చారు. రాబోయే మూడు నెలల్లో కనీసం 100 ఎంఎస్ఎంఈ కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్ అయ్యేలా ఎంఎస్ఎంఈ శాఖ కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు లోకేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయులు, కేశినేని శివనాథ్, ఎన్ఎస్ఈ సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఏను
# రద్దు చేయాలి

**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేసి, గతంలో మాదిరిగా పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి అప్పగించాలని కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పేర్కొన్నారు. నీట్-యుజి పరీక్షను రద్దు చేసిన ఎన్ టి ఎను రద్దు చేయాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. నీట్- యుజి పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదం, ప్రశ్నాపత్రాల లీకేజీలు అత్యంత తీవ్రమైనవి, ఖండించదగినవని అన్నారు. కేంద్రం పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎన్ టి ఎకు అప్పగించిన తర్వాత ప్రశ్నాపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదని అన్నారు. ఈ పరిస్థితి సంవత్సరాల తరబడి కఠోరశ్రమతో పరీక్షకు సిద్ధమయ్యే లక్షలాది మంది విద్యార్థుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సంవత్సరాల తరబడి కృషి, ఆర్థిక ఇబ్బందులతో పరీక్షల కోసం సిద్ధమవుతారని, కానీ ఇటువంటి అవకతవకలు వారికి సరైన అవకాశాలను దూరం చేస్తున్నాయని మండిపడ్డారు. పరీక్షలను విశ్వసనీయంగా నిర్వహించాల్సిన బాధ్యత గలవారు భద్రతను కల్పించడంలో విఫలమవడం దేశ విద్యావ్యవస్థకు పెద్ద అవమానమని అన్నారు. కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ మాఫియాల పాత్రపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్రమైన, పారదర్శకమైన, నిర్ణీత కాలంలో విచారణ జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రయోగాలకు ప్రయోగశాల కాదని, ప్రవేశ పరీక్షల నిర్వహణను అపహాస్య చేస్తూ విద్యార్థుల కలలను నాశనం చేయవద్దని కోరారు.

## ఇజ్రాయిల్ సైన్యం డ్రోన్లతో
# కార్లపై దాడి
## - ఎనిమిది మృతి

**లెబనాన్ – సూర్య వాస్తవం**

ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్ పౌరుల్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోంది. బుధవారం బీరూట్ -- దక్షిణ లెబనాన్‌ని కలిపే ప్రధాన రహదారిపై వెళుతున్న కార్లపై ఇజ్రాయిల్ సైన్యం మూడుసార్లు డ్రోన్ల దాడికి పాల్పడింది. దీంతో ఇద్దరు చిన్నారులతో సహా ఎనిమిది మంది మృతి చెందారు. ఈ విషయాన్ని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. లెబనాన్ రాజధాని బీరూట్‌కి దక్షిణంగా సుమారు 20 కిలోమీటర్ల (12 మైళ్ల) దూరంలో ఉన్న జియే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఇజ్రాయిల్ పాల్పడిన డ్రోన్ల దాడికి కార్లు ధ్వంసమయ్యాయి. ఈ బాంబు దాడికి కార్ల బాహ్యభాగాలు కాలిపోయి, ముక్కలయిపోయాయి వీటికి సంబంధించిన ఫొటోలను లెబనాన్ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ దాడులు మరింత ఉద్రిక్తతలకు కారణమవుతాచపి ఆల్‌జజీరా ప్రతినిధి జైనా ఖోద్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, లెబనాన్, ఇజ్రాయిల్ బహుశా అమెరికా మధ్యవర్తిత్వంతో వాషింగ్టన్‌లో గురువారం మరో దఫా చర్చలు జరగనున్నాయి. అయితే హెజ్బుల్లా అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగే చర్చలను వ్యతిరేకిస్తోంది. మరోవైపు బుధవారం ఉదయం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని మీస్ ఎల్-జబల్, యానూహ్, బుర్జ్ షెమాలి, హులా, డెబ్ల్, అబ్బాసియ్యే ఆరు గ్రామాలు నివాసితులను బలవంతంగా తమ గ్రామాలను వదిలి వెళ్లిపోవాలని హెచ్చరించింది. అక్కడి నుంచి వెళ్లకపోతే నివాసితులను బలవంతంగా తరలిస్తామని, ఆ గ్రామాల నుంచి వెయ్యి కిలోమీటర్ల దూరంలోకి వెళ్లాలని, లేకపోతే తమ ప్రాణాలను ప్రమాదంలోకి పడేసుకున్నట్లేనని ఇజ్రాయిల్ బెదిరించింది.


# పెరగనున్న ఎండల తీవ్రత

**అమరావతి– సూర్య వాస్తవం**

రాష్ట్రంలో ఎండ తీవ్రత, వడగాడ్పులు మరింత పెరగనున్నాయని, గురువారం గరిష్టంగా 43 నుంచి 44 డ్రిగీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం, పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం, గుర్తేడు మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు, 15 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు అల్పపీడనం ప్రభావంతో గురువారం నుంచి రెండు రోజులపాటు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. బుధవారం నాడు చిత్తూరు జిల్లా రాయలపేటలో 43.7 డిగ్రీలు నమోదైందని తెలిపారు. 22 జిల్లాల పరిధిలోని 143 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.

# సంపాదకీయం

## మోడీ గోల్డెన్ స్ట్రోక్...



పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను ఊపిరి ఆడనివ్వకుండా చేస్తోంది. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ముడిసరుకు కొరత, విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయాల వైపు అడుగులు వేస్తోంది. మరో వైపు కేంద్రం బంగారం విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతుల మీద సుంకం రెట్టింపు చేసింది. ఇప్పటిదాకా అది ఐదు శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా 10 శాతానికి పెరిగిపోయింది. ఇది మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఆభరణాల తయారీకి వాడే వస్తువులు.. ఇతర లోహాలు.. పారిశ్రామిక దిగుమతులకు కూడా ఇది వర్తిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.. ఇప్పటికే బంగారం ధర (24 క్యారెట్లు) 1,40,000 మించి ట్రేడ్ అవుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆ ధర మరింత పెరిగే అవకాశం ఉంది.బంగారం దిగుమతులు పెరుగుతుండడం కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ధరలు పెరుగుతున్నప్పటికీ చాలామంది బంగారం మీద ఇన్వెస్ట్ చేస్తున్నారు. మార్కెట్ నిపుణులు కూడా బంగారం మీద ఇన్వెస్ట్ చేయాలని సూచనల మీద సూచనలు చేస్తున్న నేపథ్యంలో.. చాలామంది ఇతర రంగాలను పక్కనపెట్టి.. కేవలం బంగారం మీద మాత్రమే ఇన్వెస్ట్ చేస్తున్న నేపథ్యంలో.. ఇతర రంగాలలో కొనుగోళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ఆయా రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి అంతగా సాగడం లేదు. అందువల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందని తెలుస్తోంది. బంగారం కొనుగోళ్లు ఏడాదిపాటు తగ్గిపోతే మన దేశానికి సంబంధించిన విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తోంది.కేవలం బంగారం, ఇతర ఖరీదైన లోహాలు మాత్రమే కాదు.. ఆహార పదార్థాల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. దేశంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా నాలుగు నెలల గరిష్టానికి చేరుకుంది. నాలుగు నెలల క్రితం ఇది 3.48 శాతంగా ఉండేది. జనవరిలో 2.74 శాతంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం ఆహార ధరల పెరుగుదలే. వరుసగా ఆలు.. ఉల్లి.. టమాటా ధరలు క్రాష్ అయ్యాయి. మిగతా ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీంతో నాలుగు నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం గడిచిన నాలుగు నెలల్లో 2.13 శాతం నుంచి 4.2 శాతం వరకు పెరిగింది. జ్యువెలరీ, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ వంటి వాటిపై ఏప్రిల్ లో ద్రవ్యోల్బణం 53.61 శాతానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నిర్మాణ పనులను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫార్సు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ సెక్రటేరియట్ పునర్నిర్మాణ పనులను కూడా ప్రస్తుతానికి వాయిదా వేయనున్నారు. నిర్మల్ భవన్, ఉద్యోగ్ భవన్ వంటి భవనాల కూల్చివేత, కొత్త నిర్మాణాలను వాయిదా జాబితాలో చేర్చారు. యుద్ధం కారణంగా స్టీల్, సిమెంట్ వంటి ముడిసరుకుల సరఫరాలో అంతరాయం కలగడం, దిగుమతి ఖర్చులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక విన్నపం చేశారు. విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వదేశీ వనరులపై ఆధారపడాలని కోరారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహించాలని సూచించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కోవిడ్ కంటే భయంకరమైన సంక్షోభం ఇదని ప్రధాని వ్యాఖ్యానించడం తీవ్రతకు అద్దం పడుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలు, యుద్ధ ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సెన్సెక్స్ ఏకంగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మండుతుండటంతో భారత రూపాయి విలువ ఆల్ టైమ్ లో 95.28 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది సామాన్యులపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెంచే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నాయి. నిర్మాణ రంగం ఆగిపోతే లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఆన్‌లైన్ క్లాసుల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నాయి. ఒక దేశం వద్ద ఉన్న విదేశీ మారకద్రవ్యం, బంగారం, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ వద్ద ఆదేశానికి సంబంధించిన కరెన్సీ హక్కులు, ఐఎంఎఫ్ లో సభ్యత్వం తీసుకున్నప్పుడు.. ఆ దేశం రిజర్వ్ చేసిన సొమ్ములో 25 శాతం. ఇలా ఈ నాలుగింటిని కలిపి విదేశీ మారక ద్రవ్య నిల్వలు అని పిలుస్తుంటారు.. ఇవి ఒక దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటిని అంచనా వేసి ఆ దేశం ఆర్థికంగా ఏ స్థాయిలో ఉందో అన్ని పనులు అంచనా వేస్తారు..మూడీస్, ఎస్ అండ్ పీ, ఫిచ్ వంటి సంస్థలు ఫారెక్స్ రిజర్వ్ అధికంగా ఉన్న దేశాలకు అద్భుతమైన రేటింగ్ ఇస్తాయి. ఈ రేటింగ్ గనక అధికంగా ఉంటే.. ఆదేశాలకు తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తుంటాయి. ఉదాహరణకు మనం లోన్ కోసం బ్యాంకు దగ్గరికి వెళ్తే.. మన సిబిల్ స్కోర్ చూస్తుంటారు. అది బాగుంటే బ్యాంక్ అధికారులు లోన్ వెంటనే మంజూరు చేస్తుంటారు. ఇదే విధానాన్ని దేశాలకు కూడా అప్పులు ఇచ్చే సంస్థ పాటిస్తుంటాయి.ఒక దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతున్నాయంటే.. విదేశీ పెట్టుబడిదారులు తాము పెట్టిన ఇన్వెస్ట్మెంట్ మొత్తాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు లెక్క. ఒక దేశానికి సంబంధించి ఏడు నుంచి పది నెలల వరకు క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేయడానికి డబ్బులు ఉంటే.. ఆ దేశానికి సంబంధించిన పరపతి బాగున్నట్టు లెక్క. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనదేశ విదేశీ మారకద్ర నిల్వలు బాగానే ఉన్నాయి. పశ్చిమ ఆసియాలో యుద్ధాలు ముగిసే పరిస్థితి కనిపించకపోవడంతో క్రుడ్ ఆయిల్ ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఎరువుల ధరలు కూడా భారీగా పెరుగుతాయని సమాచారం. దీనివల్ల ఫారెక్స్ నిల్వలు మరింత దారుణంగా కరిగిపోయే ప్రమాదం ఉంది.మన దేశానికి విదేశాల నుంచి వచ్చే డబ్బులో గల్ఫ్ ప్రాంతం నుంచి అధికంగా వస్తుంది. అక్కడ యుద్ధం వల్ల పరిస్థితులు మారిపోయాయి. మనవాళ్లు పంపే డబ్బు పూర్తిగా తగ్గిపోయింది. పైగా మన ఎగుమతుల వల రావాల్సిన డాలర్ల ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. దీనివల్ల మనకు రావలసిన డబ్బు రాకపోగా.. ఉన్న డబ్బు ఖర్చు అవుతుంది. అందువల్లే ప్రధానమంత్రి ఆ స్థాయిలో హెచ్చరికలు చేశారు.అయితే, దేశ ఆర్థిక భద్రత దృష్ట్యా ఈ కఠిన నిర్ణయాలు తప్పవని బీజేపీ వర్గాలు సమర్థించుకుంటున్నాయి.


### జగన్‌తో దోస్తీ...వయా

# విజయ్ - రాహుల్ ప్లాన్



**చెన్నై-సూర్య వాస్తవం :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు బిజెపిపై పల్లెత్తు మాట అనని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా స్వరం పెంచుకుంది. దేశ ప్రజలు పొదుపు పాటించాలని ఏడు అప్పీల్స్ చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. వాటిని జాతీయ మిషన్ గా ప్రకటించారు. అయితే ఇప్పుడు వ్యతిరేకంగా వైసీపీ కామెంట్లు పెడుతోంది. గతంలో కేంద్రం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా శభాష్ అని పొగిడేవారు జగన్. బిజెపి అడగకుండానే మద్దతు తెలిపేవారు. కానీ ఇప్పుడు సడన్‌గా రూటు మార్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ పొదుపు మంత్రాన్ని బోధిస్తే.. దానిని తప్పు పడుతూ మాట్లాడారు పేర్ని నాని. ప్రధాని స్థాయి నేతను చులకన చేస్తూ మాట్లాడారు.తమిళనాడులో విజయ్ గెలుపుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన చేంజ్ కనిపిస్తోంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన క్రమంలో సాక్షి మీడియా చూపించిన ప్రత్యేక ఆసక్తి ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. విజయ్ గెలుపును ఒక చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించింది సాక్షి. అంతటితో ఆగకుండా ఆయనకు రాహుల్ గాంధీతో ఉన్న పాత స్నేహాన్ని హైలైట్ చేస్తోంది. అయితే రాహుల్ ను ఎత్తిచూపడం ద్వారా.. ఏపీలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు దిశగా జగన్ ఆలోచన చేస్తున్నారా అనేది ఒక అనుమానం. ఏపీలో జవసత్వాలు లేకుండా ఉంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే ఆ పార్టీకి ఓటు బ్యాంకు ఉంది. మళ్లీ జగన్ రూపంలో పొత్తు పెట్టుకుంటే క్యాడర్ ఉత్సాహంతో పనిచేసి.. ఐదు నుంచి 10% ఓటర్లు యాక్టివ్ అవుతారు. సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న చాలా వర్గాలు తిరిగి యాక్టివ్ అవుతాయి. విజయ్, రాహుల్ గాంధీ మధ్య ఉన్న బంధాన్ని సాక్షి విపరీతంగా ప్రచారం చేయడం చూస్తుంటే.. ఏపీలో ఏదో పొత్తుల వ్యూహం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నేళ్లుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను పరిశీలిస్తే.. నేరుగా బిజెపి పై కానీ.. ఎన్డీఏ ప్రభుత్వం పై కాని విమర్శించిన దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు నేరుగా ప్రధానిని టార్గెట్ చేయడం ద్వారా చూస్తుంటే మాత్రం ఏదో ఒక అనుమానం వ్యక్తం అవుతుంది. పైగా ఏపీ రాజకీయాలపై ఎక్కువగా దృష్టి పెట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. జాతీయస్థాయి విధానాలపై బిజెపిపై విమర్శలు చేయడం చూస్తుంటే మాత్రం పక్క వ్యూహం అన్నట్టు అర్థమవుతోంది. ఇక ముసుగులో గుద్దులాట వద్దు అన్నట్టు ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కూడా జగన్ అభ్యంతరాలు తెలుపుతూ ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు.. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీ వ్యక్తిగత ప్రయాణాలపై కూడా వైసిపి నేతలు మాట్లాడుతున్నారంటే.. బిజెపితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవడం లేదని.. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యేందుకు ఒక మార్గమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బీజేపీతో కయ్యమేనా



**విజయవాడ- సూర్య వాస్తవం:**

పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీతో ఒక రకమైన అప్రకటిత మిత్రత్వం కొనసాగించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన రాజకీయ వ్యూహాన్ని సమూలంగా మార్చు కుంటున్నట్లు కనిపిస్తోంది. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు చేసిన సెవెన్ అప్పీల్స్ పిలుపుపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచు కుపడింది. ఇది కేవలం ఒక విధానపరమైన విమర్శ మాత్రమే కాదని, బీజేపీతో తెగతెంపులు చేసుకునే దిశగా పడుతున్న తొలి అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైసీపీ అధికార ప్రతినిధి పేర్ని, ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రజలకు నీతులు చెప్పే ముందు మోదీ ఆ సూత్రాలను స్వయంగా ఆచరించి చూపాలి అంటూ ఎద్దేవా చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు ప్రజలే కారణమన్నట్లుగా ప్రధాని వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లు ఆపాలని, విదేశీ పర్యటనలు వాయిదా వేసుకోవాలని చెప్పడం కాదని మోదీ ఆచరించాలన్నారు. తమిళనాడులో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం సాధించిన విజయం, అక్కడ ఆయన అనుసరిస్తున్న రాజకీయ పంథా జగన్‌ను ఆకర్షించినట్లు కనిపిస్తోంది. విజయ్ నేరుగా రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్‌తో జతకట్టి అక్కడ అధికారంలోకి రావడంతో, జగన్ కూడా అదే తరహా ప్రయోగానికి సిద్ధమవుతున్నారని సమాచారం. బీజేపీ , టీడీపీ,జనసేన ఒకే కూటమిలో ఉండటంతో జగన్ ఇక బీజేపీపై ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న జగన్, ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ కూటమిని ఢీకొట్టాలంటే కాంగ్రెస్‌తో కలవడమే ఏకైక మార్గమని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. విజయ్ పార్టీని నెత్తికెక్కించుకున్న వైసీపీ సోషల్ మీడియా విభాగాలు కూడా, బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపించడం ద్వారా కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు క్షేత్రస్థాయిలో సంకేతాలు పంపుతున్నాయి.

రాష్ట్రంలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి బలంగా ఉండటంతో, జగన్ ఇక తన పోరాటాన్ని నేరుగా కేంద్రంపైకి మళ్లించాలని నిర్ణయించుకున్నారు. గతంలో విభజన హామీలు, ప్రత్యేక హోదా విషయాల్లో కేంద్రంపై మెతక వైఖరి అవలంబించారనే విమర్శలను చెరిపివేసేందుకు మోదీని నేరుగా టార్గెట్ చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ఇటీవల పార్లమెంట్ లో ప్రత్యేకహోదా అంశాన్ని వైసీపీ ఎంపీలు ప్రస్తావించారు. ప్రధాని మోదీ విఫలమవుతున్నారని వైసీపీ అధికారికంగా ప్రకటించడం అంటే, భవిష్యత్తులో బీజేపీతో దోస్తీకి శాశ్వతంగా ముగింపు పలికినట్లేనని భావించవచ్చు. విజయ్ స్ఫూర్తితో కాంగ్రెస్ వైపు అడుగులు వేయడం ద్వారా జగన్ తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటున్నారు. ఒకవేళ జగన్ నిజంగానే కాంగ్రెస్‌తో జట్టు కడితే, అది ఏపీలో మాత్రమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పెద్ద సంచలనంగా మారనుంది.

# టీడీపీలో కమిటీల లొల్లి...



**గుంటూరు- సూర్య వాస్తవం :**
టిడిపి లో ఇటీవల రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జాతీయస్థాయిలో మంత్రి నారా లోకేష్ అదేవిధంగా పలువురు ఎంపీలు కూడా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో విస్తృతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ విస్తృతంగా పుంజుకోవాలన్నది ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా వైసీపీకి బలంగా ఉన్న కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీని విజయవంతంగా ముందుకు నడిపించేందుకు వీలుగా ఈ కమిటీలు పనిచేయాలన్నది చంద్రబాబు చేసిన దిశా నిర్దేశం. ఈ క్రమంలోనే కొత్తవారికి అదేవిధంగా యువతకు కూడా ప్రాధాన్యం కల్పించారు. వీరికి పార్టీ పరంగా అన్ని విధాల అండదండలు ఉంటాయని కూడా చెప్పారు. అయితే కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి నాయకులు కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలకు సహకరించటం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కొత్తగా నియమించిన నాయకులు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు.. తలెత్తుతున్నాయి. దీంతో కొత్త నేతలు తమ పనులను చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పేరుకు మాత్రం కొత్తగా నాయకత్వాన్ని నియమించారని, కానీ క్షేత్రస్థాయిలో ఉన్న సీనియర్ నేతలను తమ మాట వినేలా కనీసం సూచనలు చేసేలా ఏమాత్రం దిశా నిర్దేశం చేయకపోవడాన్ని కొత్త నేతలు తప్పుపడుతున్నారు. ఇప్పుడిప్పుడే బాధ్యతలు చేపట్టిన తమకు ఎమ్మెల్యేల నుంచి ఎంపీల నుంచి సహకారం లేకపోతే ఏ విధంగా ముందుకు సాగాలని కూడా క్వశ్చన్ చేస్తున్నారు. ఉదాహరణకు కడప నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డి కొత్తగా నియమించిన కమిటీలకు ఏమాత్రం సహకరించడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది.అదేవిధంగా అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొత్తగా నాయకులను నియమించినప్పటికీ వారి ప్రభావం కూడా కనిపించడం లేదు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితులు తీవ్రతరం అవుతున్న వాతావరణం కనిపిస్తుంది. ఇది కొత్త నాయకత్వానికి ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు అయిన నాయకులకు కూడా ఇబ్బందికరంగా పరిస్థితులు తెచ్చేలాగా కనిపిస్తుంది. వీటిని సరిదిద్దాలని కొత్త నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని కోరుతోంది.అయితే ఇప్పుడే కమిటీలను ఏర్పాటు చేశామని త్వరలో పుంజుకునే అవకాశం ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెబుతున్నారు. మరోవైపు రెండు మూడు మాసాల్లోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతోనే నూతనంగా కమిటీలను ఏర్పాటు చేశారు.

అయితే ఈ లక్ష్యం ఏ మేరకు సాధిస్తారు.. ఏ మేరకు విజయం సాధించగలుగుతారు అనేది కమిటీలు పనిచేసే తీరును బట్టి ఆధారపడి ఉంటుంది. కానీ అసలు పని చేసుకునేందుకు అవకాశం కల్పించే వాతావరణం లేకపోవడం సీనియర్ నాయకులు స్పందించకపోవడం సహకరించకపోవడం అంటూ ఇప్పుడు ప్రధాన సమస్యలుగా మారాయి. వీటిని తక్షణం పరిష్కరించే దిశగా పార్టీ అధిష్టానం దృష్టి పెట్టాలన్నది కొత్తగా ఏర్పడిన కమిటీలు కోరుతున్నాయి. వీటిని పరిష్కారం చేయనంతవరకు తాము ఏ ప్రయత్నం చేసిన వృధా అవుతుందని కొందరు చెబుతున్నారు. మొత్తంగా కొత్త కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు మాత్రం కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** వైయస్సార్ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి దేశవ్యాప్తంగా మే 4వ తేదీన జరిగినటువంటి నీట్ ప్రవేశ పరీక్షలలో 20 లక్షలకు పైగా రాశారు. ఈరోజు పేపర్ లీకేజ్ జరిగిందని పరీక్షను రద్దు చేయడం జరిగింది. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని వైస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంజునాథరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేద మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాట మాడుతుందని మండిపడ్డారు దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు పైగా ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యను పూర్తి చేసుకొని నీట్ ప్రవేశ పరీక్ష ప్రిపేర్ అయ్యి పరీక్ష రాస్తే ఇప్పుడు పరీక్ష పేపర్ లీకేజ్ అయిందని నీట్ పరీక్షను రద్దు చేయడం జరిగిందన్నారు.. నీట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు అప్లై చేసుకుని చాలా రోజుల నుంచి ప్రిపేర్ అయ్యి వివిధ జిల్లాల నుంచి వివిధ జిల్లాలకు పోయి పరీక్ష రాస్తే ఈరోజు పేపర్ లీకేజ్ అయిందని రద్దు చేశారు విద్యార్థుల సమయాన్ని కేంద్ర ప్రభుత్వం వృధా చేయడమే కాకుండా వాళ్ళ ఆశలు పోయే విధంగా చేసిందని మండిపడ్డారు. గత సంవత్సరం కూడా ఇదే తరహాలో హర్యానా బీహార్ రాష్ట్రాలలో నీట్ పరీక్ష పేపర్ను 30 లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు అమ్ముకొని లీకేజ్ చేశారని గుర్తు చేశారు మరి ఈ సంవత్సరం కూడా అదే తరహాలోనే డబ్బులకు నీట్ పేపర్ ను అమ్ముతున్నారని మండిపడ్డారు చాలామంది విద్యార్థులు బాగా చదువుకొని నీట్ ప్రవేశ పరీక్షలో సీటు కొట్టాలన్న ఆశతో పరీక్ష రాస్తే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేపర్ ను లీకేజ్ చేయడం జరిగిందన్నారు దానివల్ల విద్యార్థుల జీవితాలు తీవ్రంగా నష్టపోతాయని కేంద్ర ప్రభుత్వం పైన మండిపడ్డారు.

ఎన్ టి ఏ ఏజెన్సీ ద్వారా నీట్ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవ త్సరాల నుంచి నిర్వహిస్తా ఉంది ఈ కొన్ని సంవత్సరాల లోనే రెండుసార్లు లీకేజ్ కావడం కేంద్ర ప్రభుత్వం నీట్ ప్రవేశ పరీక్ష పైన ఎంత శ్రద్ధ చూపిస్తా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి నీట్ ప్రవేశ పరీక్ష లీకేజ్ ఘటన పైన ఇది రెండవసారి జరగడం దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో ఏ రాష్ట్రాలకు సంబంధించి ఆ రాష్ట్రాలలో నీట్ ప్రవేశ పరీక్ష ఏర్పాటు చేసేవారని గుర్తు చేశారు. ఆ సందర్భంలో ఎప్పుడూ కూడా నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పేపరు లీకేజ్ జరిగింది లేదన్నారు కానీ కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నీ ప్రవేశ పరీక్షను డబ్బులకు అమ్ముకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని కేంద్ర విద్యా శాఖ నిర్లక్ష్యం వల్లనే ఇలా రెండు సంవత్సరాల లో పేపర్ లీకేజ్ కావడం జరిగిందని తెలిపారు తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్ టి ఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వినోద్, కుళ్లాయి స్వామి,పాల్గొన్నారు.

## నూతన కమిటీ సభ్యులను సన్మానించిన జనసేన ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్





**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ప్రభుత్వ ఆసుపత్రి నూతన కమిటీ సభ్యులను జనసేన నియోజకవర్గ ఇంచార్జి గౌతమ్ కుమార్ ఘనంగా సన్మానించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు తిమ్మప్ప, సుదర్శన, సరస్వతిలకు ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు తమ సేవా భావం, నాయకత్వ పటిమతో ఆసుపత్రి అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి మౌలిక వసతులు మెరుగుపడి, మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సభ్యుల పదవీకాలం విజయవంతంగా సాగాలని, సమాజ శ్రేయస్సు కోసం వారు నిరంతరం శ్రమించాలని కోరుకుంటూ వారిని గౌరవించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి గౌతమ్ కుమార్‌తో పాటు నాయకులు మల్లికార్జున, మణికుమార్, అనిల్ ఇతర నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా వైసీపీ యువనేత వై.భీమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో భీమా యూత్ ఆధ్వర్యంలో వై శివరామిరెడ్డి కుమారుడు యువ నాయకుడు ఎల్లారెడ్డి భీమిరెడ్డి జన్మదిన వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేసి, ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమా యూత్ సభ్యులతో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఉపసర్పంచ్ కుళ్ళాయి స్వామి, టైలర్ లాలు సాబ్, తలారి చెన్నప్ప, పూసల నరేష్, ఆకుల పరంధామ, వెల్డింగ్ సుధాకర్, మేక నాగరాజు, ఇతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ భీమిరెడ్డిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. యువతకు ఏ కష్టం వచ్చినా, ఏ సమయంలోనైనా అండగా నిలిచే ఏకైక నాయకుడు భీమిరెడ్డి నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, యువతను ప్రోత్సహించడంలో ముందుంటారని అన్నారు. చాబాల గ్రామ యువత తమ అభిమాన నాయకుడి పుట్టినరోజును సేవా దృక్పథంతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## సాయి లక్ష్య బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవంలో వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం :** మహిళలు ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకొని తమ వ్యాపార రంగంలో రాణించాలని, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించ డమే ప్రామాణికం కావాలని సాయి లక్ష బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవంలో మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని పార్లపల్లి రోడ్డులో బుధవారం చర్మ సౌందర్య నిపుణురాలు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో సాయి లక్ష బ్యూటీ పార్లర్ ని మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, వైకాపా పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ పార్లర్ ప్రారంభోత్సవ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని యజమానురాలు లక్ష్మీప్రసన్నని అభినందించి ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకొని తమ వ్యాపార రంగంలో మరింత రాణించాలనివారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీప్రసన్న కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్య ఉపకేంద్రం-1లో సార్వత్రిక టీకా

**నార్పల - సూర్య వాస్తవం :** ఆరోగ్య ఉపకేంద్రంలో 10 మంది గర్భవతులు, పలువురు చిన్న పిల్లలు. ఏఎన్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎన్ఎం కృష్ణవేణి టీకాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. టీకాలు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, వ్యాధులతో పోరాడే శక్తిని అందిస్తాయి.చిన్నారులకు సోకే ప్రాణాంతక వ్యాధుల పోలియో, మీజిల్స్ తట్టు వంటి తొమ్మిది రకాల ప్రమాదకరమైన వ్యాధుల నుంచి ఈ టీకాలు రక్షణ కల్పిస్తాయి. గర్భవతులకు టీకాలు వేయడం ద్వారా ప్రసవ సమయంలో తలెత్తే ఇబ్బందులను తగ్గించడమే కాకుండా, పుట్ట బోయే బిడ్డకు కూడా రక్షణ లభిస్తుంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందించే ఈ టీకాలు పూర్తిగా ఉచితం మరియు సురక్షితం. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి.

## శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా వెంకటేశు



**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** శ్రీ సత్య సాయి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా ఏ వెంకటేశును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది. శ్రీ సత్య సాయి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా గతంలో ఉన్న దేవరాజ్ పదవీకాలం ముగియడంతో అప్పటినుంచి ధర్మవరం డిప్యూటీ డిఈఓ ప్రస్తుత శ్రీ సత్య సాయి జిల్లా డీఈవో కృష్ణప్పకు సమగ్ర శిక్ష ఏపీసీగా అదనపు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.అయితే స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గా ఉన్న వెంకటేశును సమగ్ర శిక్ష ఏపీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన త్వరలోనే శ్రీ సత్య సాయి జిల్లా ఏపీసీగా బాధ్యతలను చేపట్టనున్నారు.

## నిరాశ్రయులకు పండ్లు పంపిణీ

**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల నగరిగుట్ట పట్టణ ప్రాథమిక ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ కుమార్తె నేసే మౌనిక ప్రథమ వర్ధంతి సందర్భంగా నగరిగుట్టలోని నిరాశ్రయుల ఆశ్రమం లోని వృద్ధులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, తండ్రి సురేష్,చెల్లెలు నేసే స్వరూప ల చేతులమీదుగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో రాఘవేంద్ర రెడ్డి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## నగదు బహుమతులు అందుకున్న మాసాపేట విద్యార్థిని




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :** స్థానిక మాసాపేట పిఎం. సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుష్మా తాజ్ గత నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 590 మార్కులు సాధించింది. పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలవడమే కాక , రాయచోటి డివిజన్ ప్రభుత్వ పాఠశాల ల స్థాయిలో టాపర్ గా నిలిచింది. ఈ అమ్మాయి ప్రతిభను అభినందిస్తూ పలువురు మంగళ వారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నగదు బహు మతులు అందజేశారు. పాఠశాల మై స్కూల్- మై ప్రైడ్ స్పెషల్ ఆఫీసర్ నాగేంద్ర బాబు గారు 5000 రూపాయలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి విద్యార్థులను ప్రోత్సహించడం తనకెంతో ఆనందంగా ఉందని,ముందు ముందు ఇటువంటి ఫలితాలు సాధించినట్లయితే తప్పనిసరిగా మంచి ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. తరువాత విశ్రాంత ప్రిన్సిపాల్ తరుగు మణికుమారి వారి కుమారులు కృష్ణ చైతన్య పదివేల రూపాయలు ఈ అమ్మాయికి ఇచ్చారు. తమ సబ్జెక్టు హిందీలో నూటికి నూరు మార్కులు సాధించినందుకు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయిని బీబీ ఫాతిమా వెయ్యి రూపాయలు అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ బాబు మాట్లాడుతూ ఇంతమంది తమ విద్యార్థిని సుష్మా తాజ్ ను అభినందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు .పాఠశాలలో విద్యార్థుల కేంద్రంగా చేసుకొని ఉపాధ్యాయులు ఉత్తమ బోధనా పద్ధతులను అనుసరించడం వల్లే ఇంతటి గొప్ప ఫలితాలు సాధించామని చెప్పారు. విద్యార్థులలో సమస్య సాధన సామర్థ్యాలను అభివృద్ధి చేస్తూ , సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, విలువలతో కూడిన విద్యను అందించడం వల్లే పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల లో 16 మందికి 500 కంటే ఎక్కువ మార్కులు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉత్తన్న, కాలేశా మస్తాన్, బీబీ ఫాతిమా, మహమ్మద్ ఇలియాస్, సుమంత్, ఆంజనేయులు, శేఖర్, షౌకత్ అలి పాల్గొన్నారు.

## టిడిపి నాయకున్ని పరామర్శించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి -సూర్య వాస్తవం :** పామిడి మండలం గజరాంపల్లి గ్రామం నందు టిడిపి సీనియర్ నాయకుడు హనుమంత రెడ్డి సోదరుడు ఇటీవల మరణించిన విషయాన్ని తెలుసుకొని గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ గజరాంపల్లి గ్రామంలో హనుమంత రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష పేపర్ లీక్, నీట్ పరీక్ష రద్దు దురదృష్టకరం

- పరీక్షలు కూడా నిర్వహించలేని పనికిమాలిన మోడీ ప్రభుత్వం
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు వ్రాసిన,ఎంతో ప్రతిష్టాత్మక మైన 2026 నీటి పరీక్ష పేపర్ లీక్ అవడం నీట్ పరీక్షను రద్దు చేయడం చాలా దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ వైఫల్యానికి ఇది ఒక మచ్చుతునక అన్నారు. మోడీ 12 ఏళ్ల పాలనలో దాదాపు 89 సార్లు పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని,పరీక్షలు రద్దు అయ్యాయని తులసి రెడ్డి అన్నారు.పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుంది మోడీ పాలన తీరు అని తులసి రెడ్డి ధ్వజమెత్తారు.లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు . మాటలు కోటలు దాటుతున్నాయి, తెడ్డు గడప దాటడం లేదు అన్నట్లు ఉంది మోడీ పాలనా తీరు. పరీక్షలు కూడా పకడ్బందీగా నిర్వహించలేని పనికిమాలిన ప్రభుత్వంగా మోడీ ప్రభుత్వం తయారు అయిందని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎల్పీ అల్లా బకాష్, , రఫీ, ఖాదీర్, దర్బార్, షాజహాన్, మహమ్మద్, రాజు, సుబ్బరాజు, ఈశ్వరయ్య, ఆంజనేయులు, శివరాం, రామచంద్ర, అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న, వెంకటేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు తల్లులూ..భవిష్యత్తు మీదే!


- ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ శివజ్యోతి
- బాలసదనం సందర్శించిన జేడీ
- అక్కడి చిన్నారులతో మాటామంతి
- వారిలోని ప్రతిభను గుర్తించి అభినందించిన శివజ్యోతి
- చిల్డ్రన్ హోం నిర్వాహకురాలు రఫీమున్నీసా, సిబ్బందికి ప్రత్యేక ప్రశంసలు



**అనంతపురం – సూర్య వాస్తవం :**
'మేమూ మీ వయస్సులో ఉన్నప్పుడు ఎన్నో ఒడిదుడుకులు చూశాం. ఇప్పుడున్న సౌకర్యాలు, వసతులు, అవకాశాలు అప్పుడు లేవు. అయినా పట్టుదలతో చదివాం. ఇప్పుడు ఈ స్థాయిలో ఇలా మీ ముందుకు వచ్చాం. మీరు వచ్చిన నేపథ్యం ఏదైనా గానీ వాటిని మనస్సులో నుంచి పూర్తిగా తుడిచేయండి. ఇప్పటి నుంచే మీకంటూ ఒక లక్ష్యం ఏర్పరచుకోండి. వాటిని సాకారం చేసుకునే దిశగా ఆలోచించండి. అడుగులు వేయండి. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి. కసితో చదవండి. మీరనుకున్న లక్ష్యం నెరవేర్చుకుంటారు. అప్పటికి మేమంతా రిటైర్డ్ అయి ఇళ్లల్లో ఉంటాం. భవిష్యత్ అంతా మీదే. మాలాగా మంచి హోదాల్లో మీరు కూడా స్థిరపడాలి. పది మందికి ఉపయోగపడాలి' అంటూ ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్(జేడీ) శివజ్యోతి అన్నారు. అనంతపురం బుడ్డప్పనగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంను పీడీ శశికళతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన జేడీ.. బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలు తమ చిట్టి చేతులతో రూపొందించిన కలర్ పేపర్ల బొకేను అందించి స్వాగతం పలికారు. వాటిని ఎలా తయారు చేశారు, ఎవరు చేశారంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. మీరొస్తున్నారని.. మేమే చేశాం మేడం అంటూ చిన్నారుల సమాధానంతో ఆమె ఆశ్చర్యపోయారు. ఇంత అందంగా తయారు చేయడం చూస్తుంటే మీలో చాలా ప్రతిభ దాగుందని, ఇంత చక్కటి ఆలోచన ఎలా వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. మా సూపరింటెండెంట్ రఫీమున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది నేర్పించారంటూ చిన్నారులు బదులివ్వడంతో ఆమె వారిని కూడా అభినందించారు. మార్కెట్లో తయారు చేసే పుష్పగుచ్ఛాలకు ఏమాత్రం తీసిపోకుండా వాటికంటే అందంగా తయారు చేయడం తనకు బాగా నచ్చిందని, వీటిని నేను తీసుకెళ్లనా అంటూ అడిగి మరీ వెంట తీసుకెళ్లారు. చిన్నారుల క్రమశిక్షణ చూస్తుంటే ముచ్చటేస్తోందని, చదువులో కూడా ఇటువంటి చొరవ చూపి భవిష్యత్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. తరువాత కార్యాలయం గది, ఇతర గదులతో పాటు డార్మెటరీ, వంట గది.. ఇలా అన్ని గదులను ఆమె పరిశీలించారు. ఇక్కడి వాతావరణం తనను బాగా ఆకర్షించిందని, మనస్సుకు హాయిగా ఉందని పేర్కొన్నారు. అక్కడి నుంచి శిశుగృహను సందర్శించారు. కార్యక్రమంలో గుంటూరు నుంచి వచ్చిన సీడీపీఓ సునీత, డీసీపీఓ మంజునాథ్, బాలసదనం సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసా, అకౌంటెంట్ ఫాతిమా, సిబ్బంది అమీన, మాధవి పాల్గొన్నారు.

# చీని తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

- ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డి



**లింగాల– సూర్య వాస్తవం :** లింగాల మండల పరిధిలోని కామసముద్రం, అంకెవానిపల్లి, బోనాల గ్రామాలలోని చీని తోటలను కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు స్థానిక ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. . ఈ ప్రాంతంలోని చీని తోటల్లో గత కొన్ని సంవత్సరాలుగా పొలుసు పురుగు అధికంగా వ్యాప్తి చెంది చీని తోటలను నష్టపరచడం జరిగినది. ఈ సంవత్సరం మండల పరిధిలోని పలు చీని తోటల్లో ఈ పొలుసు పురుగు యొక్క ఉధృతిని సర్వే చేయడానికి విజయవాడ శాస్త్రవేత్తలు పలు గ్రామాల్లో చీనితోటలను పరిశీలించారు. ఈ పొలుసు పురుగులు మొక్క యొక్క కాండం మీద తెల్లగా ఉండి రసం పీల్చటం వలన త్వరగా బేరడు చీలి, చెట్లు వాడు పట్టడం తో పాటు కాండం మీద "పైటాఫ్థెర" అనే బంక శిలీంద్రనాసిని ఏర్పడుతుంది. దీని వలన చెట్టు వేరు వ్యవస్థ, ఎదుగుదల మందగించటంతో చెట్లు మరణించడం జరుగుతుంది అని వివరించారు. చీని చెట్లు దెబ్బ తినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్ల మించి నీరు ఇవ్వకూడదని, వీటి నివారణకు గొనె సంచితో కాండం లేద చెట్ల బేరడు పై బాగా రుద్దాలి ఆ తర్వాత "భూప్రొఫెజైన్" లీటర్ నీటికి 2.5 మిల్లి లీటర్లు మరియు "బేనోల్ ఆయిల్" ఒక లీటర్ నీటికి 10 మిల్లి లీటర్ల చొప్పున కలుపుకొని పిచికారీ చేసుకున్నట్లయితె పోలుసు పురుగును నివారించవచ్చని తెలియజేశారు. ట్రైకోడెర్మా మరియు సూడోమోనస్ ద్రావణాన్ని సంవత్సరానికి రెండు సార్లు భూమిలో తేమ ఉన్నప్పుడు పోసినట్లైతే వేరు కుళ్ళ రోగాన్ని నివారించుకోవచ్చని కేంద్ర బృంద ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యన శాఖ అధికారి జి. రాఘవేంద్ర రెడ్డి, ఆయా గ్రామాల రైతుసేవా కేంద్ర సిబ్బది విజయవాడ నుండి ఎమ్ పి గోస్వామి, జాయింట్ డైరెక్టర్ ఎంటమాలజీ,కె వి చౌదరి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంటమాలజీ,పి మను ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంయుక్త సర్వే నిర్వహించి చీని తోటలు పరిశీలించడం జరిగినది.

# నీట్ పేపర్ లీక్‌పై ఎన్ఎస్‌యుఐ ఆందోళన



**మడకశిర–సూర్య వాస్తవం :** ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కోఆర్డినేటర్ వేముల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం విద్యార్థి లోకంలో చర్చనీయాంశంగా మారాయి. నీట్ పరీక్షా పత్రాల లీకేజీ అంశంపై ఆందోళనలు వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ కారణం గా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ, విద్యార్థుల భవి ష్యత్తుతో ఆడు కోవద్దని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు పునరా వృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన మైన నిబం ధనలు తీసుకు రావాలని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కొన్ని కోచింగ్ సెంటర్లలో గెస్ పేపర్ పేరుతో నీట్ యూజీ 2026 ప్రశ్న పత్రా లు లీక్ అయ్యాయని వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా పరిగణించారు. ఈ ఆరోపణలపై తక్ష ణమే విచారణ చేపట్టి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని శ్రీని వాస్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థులు తమ జీవిత లక్ష్యంగా భావించే నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలలో పారదర్శకత లోపించడం వల్ల మెరి ట్ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# వివాహ వేడుకలలో వైసీపీ నాయకులు



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందులలోని ఏఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఎర్రంరెడ్డి పల్లెకు చెందిన చప్పిడి వారి వివాహ వేడుకలకు వైకాపా నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై వధూవరులకు ఆశీర్వచనాలు అందించారు. ఎర్రం రెడ్డి పల్లెకు చెందిన చప్పిడి క్రిష్ణారెడ్డి,లక్ష్మీదేవి ల కుమారుడు చప్పిడి రాజ శేఖర్ రెడ్డి, సుమిత్ర ల వివాహానికి పులివెందుల మాజీ మునిసిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, పులివెందుల మునిసిపల్ చెర్మన్ వరప్రసాద్, మాజీ సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప తదితరులు హాజరై వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చప్పిడి వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన శ్రీమద్భాగవత సప్తహ పఠన మహోత్సవం



**పులివెందుల – సూర్య వాస్తవం :** వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో వెలసిన శ్రీ కృష్ణ ఆలయంలో గత ఏడు రోజులుగా జరుగుతున్న శ్రీమద్భాగవత సప్తహ పఠన కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా ముగిసింది.పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమం ప్రముఖ దాతల తులసీశ్వర రెడ్డి , సాయిత్రమ్మ దంపతుల ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడింది.గత ఏడు రోజులుగా భక్తులకు,పండితులకు ఉదయం,మధ్యాహ్నం మరియు రాత్రి సమయాల్లో అల్పాహారం, భోజన వసతులు కల్పించారు. భాగవత పారాయణం చేసిన పండితులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు మంత్రపుష్పం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మహిళలు కలశాలను ధరించి ఆలయం చుట్టూ ప్రదర్శన చేపట్టారు.?ఓం నమో భగవతే వాసుదేవాయ అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగవత భక్త సమాజానికి చెందిన సభ్యులు గొందిపల్లి నారాయణరెడ్డి (సమాజం సలహాదారుడు) డి.గంగిరెడ్డి (సమన్వ యకర్త) తొందూరు నారాయణరెడ్డి(కార్యనిర్వాహకుడు) కె.కె.కొట్టాల రంగనాథం (కార్యదర్శి) తాళ్ళపల్లి గురురెడ్డి వడ్డెమాను రామలింగారెడ్డి (స్వామి గుడి నిర్మాత) యాగంటి బాలకృష్ణారెడ్డి (మీడియా కన్వీనర్) వీరితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.





# సినిమా నడిస్తేనే మనందరికి మనుగడ

ఎగ్జిబిటర్లకు మాత్రమే కాదు.. డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు కూడా సమస్యలు ఉన్నాయని తెలుగు సినీ నిర్మాతలు అన్నారు. తాము ఇబ్బందుల్లో ఉన్నామని, పర్సెంటేజ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎగ్జిబిటర్లు ఇటీవల ప్రెస్ మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై బుధవారం సాయంత్రం తెలుగు నిర్మాతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్‌మీట్‌లో నిర్మాతలు యలమంచిలి రవిశంకర్, సూర్యదేవర నాగవంశీ, సాహు గారపాటి, సుధాకర్ చెరుకూరి, వెంకట సతీష్ కిలారు తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిటర్లు ఏకపక్షంగా ప్రెస్‌మీట్ నిర్వహించి బెదిరించినట్టుగా మాట్లాడటం సరికాదని, అందరం కూర్చొని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని నిర్మాతలు అన్నారు. ఎగ్జిబిటర్ల సమస్యను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అదే సమయంలో తమ సమస్యలకు కూడా పరిష్కారం కావాలని నిర్మాతలు అన్నారు.

నిర్మాత యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ, 'ఎగ్జిబిటర్లు ఇబ్బంది పడుతున్నారు.. మేము దానికి అంగీకరిస్తాం. కానీ, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దయచేసి గ్రహించండి. ఎన్నో ఏళ్లుగా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఇప్పుడు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఎవరూ సంతోషంగా లేరు. ముగ్గురికీ సమస్యలు ఉన్నాయి. చర్చించుకొని పరిష్కరించుకుందాం' అని అన్నారు. 'ఎకో సిస్టమ్‌లో ఒకరు బాగోకపోతే ముగ్గురూ బాగోరు. ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ ముగ్గురూ బాలేదు. కంటెంట్ లేక శ్రీరాములు లాంటి థియేటర్ ను మూసేయాల్సి వచ్చిందని వాళ్ళే చెప్పారు.

ఎగ్జిబిటర్లు ఇలాంటి షరతులు పెట్టడం వల్ల నిర్మాతల నుంచి ఇంకా కంటెంట్ తగ్గిపోతుంది తప్ప, దాని వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు కదా. ఇలా ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకొని, ఫలానా తేదీ చివరి రోజు అంటూ బెదిరించినట్టుగా మాట్లాడకండి. ఇక్కడ ఉన్న నిర్మాతలవి 50 శాతానికి పైగా చిత్రీకరణ అయిపోయిన సినిమాలు కనీసం 25 ఉన్నాయి. వీటిలో చిన్న, పెద్ద అన్ని సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే 70-80 శాతం బడ్జెట్ ఖర్చు పెట్టి ఉన్నాము. ఇలాంటి సమయంలో కొత్త విధానం తీసుకొస్తామంటే అది సబబుగా ఉండదు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న సినిమాల విషయంలో ఆ విధానాన్ని అంగీకరించలేము. కొత్తగా నిర్మించబోయే సినిమాల విషయంలో ఈ విధానంపై ఆలోచిస్తాము. కానీ, దానికి కొన్ని షరతులు ఉన్నాయి. థియేటర్ల గ్రేడింగ్, మెయింటనెన్స్ ఛార్జ్, ఆన్ లైన్ టికెట్ బుకింగ్ కన్వినెన్స్ ఛార్జ్ వంటి విషయాలపై చర్చించిన తర్వాత.. కొత్తగా నిర్మించబోయే సినిమాల విషయంలో పర్సెంటేజ్ విధానానికి వెళ్ళడంలో మాకు అభ్యంతరం లేదు' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు.

నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ, 'మనంలో మనం ఇలా కొట్టుకోవడం వల్ల లోకువ అయిపోతాం. సమస్యను పరిష్క రించుకునే దిశగా మనం వెళ్ళట్లేదు. ఈ అంశంపై ఫిల్మ్ ఛాంబర్ తరపు నుంచి కూడా మీటింగ్ లు జరిగాయి. ఓ వైపు చర్చలు జరుగుతుండగానే, అలా ఏక పక్షంగా ప్రెస్ మీట్ ఎందుకు పెట్టారో మాకు అర్థం కావడంలేదు' అని తెలిపారు. '20 సంవత్సరాల నుంచి తెలంగాణలో ఎవరు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారో అందరికీ తెలుసు. 20 సంవత్సరాల నుంచి ఎగ్జిబిటర్లకు న్యాయం చేయలేనిది ఈరోజు గుర్తుకొచ్చిందా?. సినిమా నడిస్తేనే మనందరికీ మనుగడ. లేకపోతే అందరం నష్టపోతాం' అని అన్నారు.

# నాగార్జున ఫోటోలు టీ-షర్టులు.. హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్: ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున తన అనుమతి లేకుండా పేరు, ఫోటోలను వాడుకుంటున్నారంటూ దాఖలు చేసిన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన చిత్రాలతో టీ-షర్టులను విక్రయిస్తున్న ఓ వ్యాపారిపై మంగళవారం జస్టిస్ తుషార్ రావు గెడెలా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. విచారణ సందర్భంగా "నాగార్జున ఫోటోలను వాణిజ్యపరంగా వాడుకునే హక్కు మీకు ఎవరు ఇచ్చారు?" అని సదరు వ్యాపారిని కోర్టు నిలదీసింది. దీనికి వ్యాపారి తరపు న్యాయవాది స్పందిస్తూ.. 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని, ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా నిర్మాణ సంస్థతో ఒప్పందం ఉందని తెలిపారు. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని కూడా వాదించారు. అయితే, నాగార్జునతో గానీ, సినిమా నిర్మాణ సంస్థతో గానీ తమకు ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని విచారణలో వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే చెబుతున్నప్పుడు, ఈ టీ-షర్టులను విక్రయించే చట్టబద్ధమైన హక్కు మీకు ఎక్కడిది?" అని ప్రశ్నించింది. దీంతో, సంబంధిత ఒప్పంద పత్రాలు, ఇతర ఆధారాలు సమర్పించడానికి తమకు అవకాశం ఇవ్వాలని వ్యాపారి తరపు న్యాయవాది కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.



# కోహ్లి అజేయ సెంచరీ

## కోల్ కతా నైట్ రైడర్స్ పై బెంగుళూరు



రాయ్ పూర్ : కోల్ కతా నైట్ రైడర్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)భారీ లక్ష్యాన్ని ఛేదించింది.కోల్ కతా నిర్దేశించిన 193పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు బ్యాటర్లు కోహ్లి(105నాటౌట్)సెంచరీకి తోడు పడిక్కల్(39)రాణించారు. దీంతో బెంగళూరు 19.1ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి 194పరుగులు చేసి గెలిచింది.కోల్ కతా బౌలర్లు కార్తీక్ త్యాగికి మూడు,నరైన్ ఒక వికెట్ పడగొట్టారు.ఈ గెలుపుతో బెంగళూరు పాయింట్ల పట్టికలో మరోసారి అగ్రస్థానానికి ఎగబాకింది.అంతకుముందు కోల్ కతా బ్యాటర్ రఘువంశీ అర్ధ శతకంతో రాణించడంతో నిర్ణీత 20ఓవర్లలో4వికెట్ల నష్టానికి 192పరుగులు చేసింది.రఘువంశీ అర్ధ శతకానికి తోడు గ్రీన్(32),రింకు సింగ్(49నాటౌట్)బ్యాటింగ్ లో రాణించారు.బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్,హేజిల్ వుడ్,రసిక్ సలామ్ దర్ కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లికి దక్కింది.

### వర్షంతో టాస్ ఆలస్యం

భారీ వర్షం కారణంగా నిర్ణీత సమయానికి ప్రారంభం కావాల్సిన మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది.మ్యాచ్ ప్రారంభానికి ముందు రాయ్‌పూర్‌లోని భారీ వర్షం కురవడంతో షహీద్ వీర్ నారాయణ్ సింగ్ స్టేడియం తడిసి ముద్దయ్యింది.దీంతో టాస్ గంటన్నర ఆలస్యంగా వేశారు.అయితే,ఓవర్ల కుదింపు ఏమీ లేకుండానే మ్యాచ్ ప్రారంభమైంది.టాస్ గెలిచిన అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ మాట్లాడుతూ...రొమారియో షెపర్డ్ స్థానంలో వెంకటేశ్ అయ్యర్,సుయాశ్ శర్మ స్థానంలో జాకబ్ డఫీ జట్టులోకి తీసుకున్నట్లు తెలిపాడు.కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే మాట్లాడుతూ,తాము కూడా బౌలింగ్ చేయాలనే అనుకున్నా..కీలక స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమైనట్లు..అతని స్థానంలో సౌరభ్ దూబే అరంగేట్రం చేస్తున్నట్లు తెలిపాడు.

స్కోర్ బోర్డు...

కోల్ కతా నైట్ రైడర్స్ : రహానే(సి అండ్ బి)హేజిల్ వుడ్ 19,అలెన్(సి)జితేశ్ శర్మ (బి)భువనేశ్వర్ కుమార్ 18,రఘు వంశీ (రనౌట్)భువనేశ్వర్ కుమార్ 71,గ్రీన్(బి)రసిక్ సలామ్ ధర్ 32,రింకు సింగ్ (నాటౌట్) 49, అదనం3. (20 ఓవర్లలో4వికెట్ల నష్టానికి) 192 పరుగులు.

వికెట్ల పతనం: 1/23, 2/48, 3/116, 4/192

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4-0-34-1,డఫీ4-0-48-0,హేజిల్ వుడ్ 4-0-35-1,రసిక్ సలామ్ దర్ 4-0-35-1,కృనాల్ పాండ్యా 4-0-39-0.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు : బేథెల్(సి అండ్ బి)కార్తీక్ త్యాగి 15,కోహ్లి(నాటౌట్) 105, పడిక్కల్(సి)రహానే(బి)కార్తీక్ త్యాగి 39,రజత్ పటీధర్ (సి)రహానే(బి)నరైన్11,టిమ్ డేవిడ్ (సి)మనీష్ పాండే (బి)కార్తీక్ త్యాగి 2,జితేశ్ శర్మ (నాటౌట్) 8, అదనం14. (19.1 ఓవర్లలో4వికెట్ల నష్టానికి) 194 పరుగులు.

వికెట్ల పతనం: 1/37, 2/129, 3/157, 4/180

బౌలింగ్:సౌరభ్ దూబే 2.1-0-21-0,వైభవ్ అరోరా 4-0-48-0,కార్తీక్ త్యాగి 4-0-32-3,నరైన్4-0-31-1,గ్రీన్2-0-22-0,అనుకుల్ రాయ్ -0-36-0.



# సింధు,లక్ష్యసేన్,శ్రీకాంత్ శుభారంభం

బ్యాంకాక్ : థాయ్ లాండ్ ఓపెన్ సూపర్-500బ్యాడ్మింటన్ టోర్నీ లో భారత్ కు మిశ్రమ ఫలితాలు దక్కాయి.బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో కిదాంబి శ్రీకాంత్,లక్ష్యసేన్ శుభారంభం చేయగా..యువ షట్లర్ ఆయుశ్ శెట్టి తొలిరౌండ్ లోనే ఇంటిదారి పట్టాడు.ఇక మహిళల సింగిల్స్ లో పివి సింధు,మాళ్విక బన్సోద్,దేవిక సిహాగ్ తొలిరౌండ్ గండం గట్టెక్కి ప్రి క్వార్టర్స్ కు చేరారు.సింధు21-9, 21-12తో కేవలం 33నిమిషాల్లో చైనీస్ తైపీకి చెందిన టంగ్-సియోవో-టోంగ్ ను ఓడించింది.రెండో రౌండ్ లో డెన్మార్క్ కు చెందిన41వ ర్యాంకర్ అమేలియా షుల్జ్ తో తలపడనుంది.ఇక21ఏళ్ల దేవిక 21-19, 13-21, 21-15తో జపాన్ షట్లర్, 26వ ర్యాంకర్ నసూకి నిడైరాను ఓడించింది.ఈ పోటీ సుమారు గంటా 11నిమిషాలసేపు హోరా హోరీగా సాగింది.ఇక తన్వీ శర్మ 21-17, 21-8తో హీనా అకేచిని ఓడించి ప్రి క్వార్టర్స్ కు చేరారు.మాళ్విక భారత్ కే చెందిన అన్మోల్ ఖర్బ్ ను ఓడించి టాప్ సీడ్ చెన్-యూఫీ(చైనా)తో పోటీకి సిద్ధమైంది.

పురుషుల సింగిల్స్ లో ప్రపంచ 11వ ర్యాంకర్ లక్ష్యసేన్ 21-16, 21-17తో43నిమిషాల్లో సింగపూర్ కు చెందిన హెంగ్ జాసన్ ను ఓడించాడు.ప్రపంచ29వ ర్యాంకర్ కిదాంబి శ్రీకాంత్21-14, 21-15తో సింగపూర్ కు చెందిన లోహ్ కియాను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్ లో చైనీస్ తైపీ ఆటగాడు సు-లి-యాంగ్ తో పోటీకి సిద్ధమయ్యాడు.ఇక21ఏళ్ల ఆయుష్ శెట్టి మూడు సెట్ల హోరా హోరీ పోరులో ప్రపంచ 9వ ర్యాంకర్,జపాన్ కు చెందిన నరోకా చేతిలో పోరాడి ఓడాడు.ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్ లో ఆయుష్ శెట్టి 13-21, 21-17, 4-21తో పరాజయాన్ని చవిచూశాడు.ఈ మ్యాచ్ సుమారు 59నిమిషాలసేపు సాగింది.

# గండి వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** శ్రీ వీరాంజనేయ స్వామి వారి కుంభాభిషేక మహోత్సవంలో రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం అతి ప్రాచీనమైన, పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రమని,పాపాగ్ని నది కుడి గట్టున శేషాచల పర్వత శ్రేణులలో నిర్మించబడిందని అన్నారు. పాపాగ్ని నది పరమ పవిత్రమైనదని, అందులో ఐదు ప్రదేశాలు మరింత పవిత్రమైనవని పురాణాలు చెబుతున్నాయన్నారు. జన్మస్థానమైన నందికొండ, వాయు క్షేత్రంగా పేరుగాంచిన గండి క్షేత్రం, కేశవ తీర్థంగా పేరుగాంచిన పావురాల గుట్ట,భాస్కర క్షేత్రం గా పేరుగాంచిన సంగమేశ్వర దేవస్థానం, పాపాగ్ని పెన్నా నదిలో కలియు చోటు పరమ పవిత్రమైన స్థలాలని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి పవిత్ర స్థలాలలో ఒకటైన వాయు క్షేత్రం వద్ద గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం నిర్మించబడింది.ప్రాచీన కాలంలో వాయుదేవుడు ఇక్కడ నివసించేవాడని అందువలన ఈ ప్రాంతానికి వాయు క్షేత్రం అని పేరు. రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వెళ్లేటప్పుడు వాయుదేవుని ఆహ్వానం మేరకు ఒకరోజు శ్రీరామచంద్రుడు ఇక్కడ ఉన్నాడని, ఆ సమయంలో ఆంజనేయుడు తనకు చేసిన సహాయానికి కృతజ్ఞతా భావంగా తన కోదండటంతో శేషాచల పర్వతశ్రేణుల్లోని ఒక రాతి ఫలకం మీద ఆంజనేయుని చిత్రాన్ని గీశాడు అని ప్రతీతి.ఇక్కడ పాపాగ్ని నదికి అడ్డంగా వాయుదేవుడు బంగారు మకర తోరణం తో శ్రీరామచంద్రుని ఆహ్వానించాడని, ఇప్పటికీ ఆ తోరణం అలాగే ఉందని, పుణ్యాత్ములకు తాము చనిపోయే ముందు ఇది కనిపిస్తుందని,ఆ విధంగా అప్పటి కడప జిల్లా కలెక్టర్ సర్ థామస్ మన్రో కి ఈ బంగారు తోరణం కనిపించిందని, తర్వాత కొద్ది రోజులకే ఆయన స్వర్గస్తులై మోక్ష ప్రాప్తి పొందాడని కడప కైఫీయతుల్లో లిఖించబడింది. అటువంటి ప్రశస్తమైన దేవస్థానం గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం. వీరాంజనేయుని కరుణాకటాక్ష వీక్షణాలు ప్రజలందరిపై ప్రసరించాలని తులసిరెడ్డి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం బోర్డు సభ్యుడు రామచంద్రారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చాగలేటి వెంకటేశు, కుమారి వర్ణిక లక్ష్మి, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### గంగమ్మ తల్లిని దర్శించుకున్న తులసి రెడ్డి

వేంపల్లె మండలం, అయ్యవారిపల్లి శ్రీ గంగమ్మ తల్లి నూతన విగ్రహ మరియు ధ్వజ, శిఖర ప్రతిష్ట మహోత్సవంలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు రామగంగి రెడ్డి,రామ సుబ్బారెడ్డి, పాపిరెడ్డి, పాలేటి రెడ్డి,వెంకట్రామిరెడ్డి, రవిశంకర్ రెడ్డి,వెంకటరమణారెడ్డి, రెడ్డయ్య తదితరులు తులసి రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అయ్యవారిపల్లి గ్రామ దేవత గంగమ్మ తల్లి కరుణాకటాక్ష వీక్షణాలు ప్రజలపై ప్రసరించాలని తులసి రెడ్డి ప్రార్థించారు.

# అందరి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తా

## - ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి

**అనంతపురం – సూర్య వాస్తవం:** పాలకవర్గంతో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మి ప్రకటించారు.బుధవారం ఉదయం ఆమె అనంతపురలోని జెడ్పీ కార్యాలయంలో గల తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు జెడ్పీ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. అనంతరం సమావేశ భవన్‌లో జెడ్పీ ఉద్యోగాలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్తానని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా పాలకవర్గం, ఉద్యోగులతో పరస్పర సహకారం, సమన్వయంతో పని చేస్తానని పేర్కొన్నారు. జెడ్పీ ఉద్యోగుల పని తీరుపై పత్రికల్లో అనేక కథనాలు వచ్చాయని, అయితే ఇప్పటి వరకు ఎవరు ఎలా పని చేశారో తనకు అవసరం లేదని, ఇక మీదట కలసి కట్టుగా పనిచేసేలా అలవాటు చేసుకోవాలన్నారు. లేదంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల పని తీరును బట్టి తాను మసలుకుంటానన్నారు.



### జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మను కలిసిన సీఈఓ

జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె క్యాంప్ కార్యాలయంలో సీఈఓగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా అభివృద్ధికి మీవంతు సహకారం కావాలని కోరారు. అందుకు చైర్ పర్సన్ గిరిజమ్మ సానుకూలంగా స్పందించారు. సీఈఓ విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.53 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- 13 మంది నిందితులు 22 కేసుల్లో

పులివెందుల డిఎస్పి బి.మురళి నాయక్



**పులివెందుల క్రైమ్ – సూర్య వాస్తవం:** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు వివిధ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి ముఠా వద్ద నుంచి సుమారు రూ.53,01,700 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డిఎస్పి వి మురళి నాయక్ తెలిపారు.? బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోలీసులు ముగ్గురు వేర్వేరు రకాల నేరగాళ్ల నుండి 19 మోటార్ సైకిళ్లు వాహనాలు (విలువ రూ.18,15,000), నగదు రూ. 2,79,000, వెండి 1 కేజీ వెండి వస్తువులు (విలువ రూ.2,80,000), బంగారం 194 గ్రాముల బంగారు ఆభరణాలు (చైన్ స్నాచింగ్ ద్వారా 91 గ్రాములు, బంగారు షాపులో 103 గ్రాములు), మొబైల్ ఫోన్లు 2 సెల్ ఫోన్లు (విలువ రూ. 50,000) వాటిని రికవరీ చేసి మొత్తం 13 మంది నిందితులను 22 కేసుల్లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నరకలపేట నాగ భాష, బూసుపాటి కుమార్,గుండ్ల గంగయ్య,షేక్ హుస్సేన్, మరియు మలికె విజయ్ లు మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడ్డారని,చోటు కుమార్ (బీహార్) మరియు రవిప్రసాద్ (రాజస్థాన్)లు చైన్ స్నాచర్లని, సాగబాలి నారాయణమ్మ మరియు సాగబాలి ఉమాదేవి లు బంగారు షాపు లో మతనాలు చేశారని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పులివెందుల ఎస్ డి పి ఓ బుక్కే మురళి నాయక్ ,అర్బన్ సీఐ కె. శ్రీరామ్, ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, ఎల్.తిమ్మోతిలను, ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహా కుంభాభిషేకంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు



**వేముల– సూర్య వాస్తవం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి ఆంజనేయస్వామి దర్శించుకున్న టిడిపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి. రాయలసీమకి తలమానికమైన గండి ఆంజనేయ స్వామి గుడి పునః ప్రతిష్ట కార్యక్రమాలు గత నాలుగు రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం గండి క్షేత్రానికి వెళ్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలియజేశారు.

# గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు



**వేముల– సూర్య వాస్తవం:** వేంపల్లె మండలం అయ్యవారిపల్లెలో నూతన గంగమ్మ గుడి ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న పేర్ల పార్థసారధి రెడ్డి .వేంపల్లె మండలం అయ్యావారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ గుడి లో గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల భాగంగా బుధవారం అయ్యవారిపల్లి గ్రామానికి వెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేక కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో భాగస్వాములయ్యారు.


# నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం చెంచయ్య గారి పల్లెలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వ్యక్తిగత సిబ్బంది చిలమల నర్సింహులు పెద్ద కుమారుడు నరసింహ వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ముడుమాల పోలిరెడ్డి ఎస్సార్ శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, పూజ శివయ్య యాదవ్, మైదుకూరు, చాపాడు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు

## - ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మణికంఠుడు



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోతి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి,మధు,గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం,సహస్రనామార్చన, బిల్వ అర్చన,అష్టోత్ర శతనామావళి,తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు.ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంకాల సమయాన భజన కార్యక్రమాలు భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )